ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్
గురువారం 20 జూన్ 2024
జిల్లాల వార్తలు


సంగారెడ్డికి మెట్రో రైల్ తెస్తా..
• ఉద్యమకారులకు ద్రోహం చేసిన బీఆర్ఎస్
• మెదక్ ఎంపీ రఘునందన్
7లో

వరుణుడు కరుణిస్తేనే..!


మునిపల్లి మండలం మేళసంఘం గ్రామంలో రైతు శంకర్‌గౌడ్‌కు చెందిన వ్యవసాయ బోరు నుంచి వస్తున్న నీళ్లు

భూగర్భ జలం సుభిక్షం

- గతేడాదితో పోల్చితే స్వల్పంగా పడిపోయిన భూగర్భ జలాలు
- ఏడు మండలాల్లో మాత్రం కాస్త పైపైకి గంగమ్మ..
- వర్షాలు కురవకుంటే ఖరీఫ్‌లో కష్టాలే
- లేదంటే బోరువావులే దిక్కు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 19 : సంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి చిత్రంగా ఉంది. కొన్ని మండలాల్లో గంగమ్మ పాతాళానికి చేరితే.. మరికొన్ని మండలాల్లో పైకి వచ్చింది. గతేడాది కన్నా ఈసారి ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయిలో నమోదు కావడంతో భూతాపం పెరిగి, కొన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గిపోయింది. అదే సందర్భంలో గత నెలలో కురిసిన వర్షాల కారణంగా కొన్ని మండలాల్లో భూగర్భ జలం కాస్త పైకి వచ్చింది. అయితే, జిల్లా మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని సగటున లెక్కకడితే భూగర్భ జలాలు కొంతమేర పడిపోయాయి. గతేడాది మే నెలలో సగటున 12.43 మీటర్ల అడుగున భూగర్భ జలం ఉంటే ఈ ఏడాది 13.20 మీటర్ల లోతులో ఉన్నాయి. గతేడాది కంటే 0.77 మీటర్ల స్వల్ప లోతుకు పడిపోయింది. వరుణ దేవుడు కరుణిస్తేనే గంగమ్మ పైపైకి వచ్చి వ్యవసాయానికి చింత తీరుతుంది.

పుల్కల్‌లో 6.04, కొండాపూర్‌లో 27.42 మీటర్ల లోతులో

జిల్లాలోని 28 మండలాలకు గానూ ఏడు మండలాల్లో భూగర్భ జలం కాస్త పైకి వచ్చింది. మిగిలిన 21 మండలాల్లో మాత్రం భూగర్భ జలం మరింత అడుగంటిపోయింది. భూగర్భ జలం పైకి వచ్చిన మండలాల్లో హత్నూర, కల్హేర్, మునిపల్లి, నాగలిగిద్ద, న్యాల్‌కల్, రామచంద్రాపురం, సంగారెడ్డి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 6.73 మీటర్ల లోతునే గంగమ్మ ఉన్నట్లు భూగర్భ జల శాఖ అధికారవర్గాలు తెలిపాయి. మిగిలిన మండలాల్లో 6.04 మీటర్ల నుంచి 27.42 మీటర్ల అడుగులో భూగర్భ జలం ఉన్నది. అయితే, ఈ మండలాల్లో గతేడాది మే నెలతో పోల్చితే మాత్రం మరింత అడుగుకు పడిపోయింది. భూగర్భ జల శాఖ తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం పుల్కల్ మండలంలో 6.04 మీటర్ల లోతులోనే ఉండగా, కొండాపూర్ మండలంలో 27.42 మీటర్ల అడుగుకు చేరింది.

సాగు సవ్యంగా సాగాలంటే..

సాగునీటి వనరులు అంతగా లేని సంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలం అందుబాటులో ఉంటేనే సాగు సాధ్యమవుతుంది. యాసంగి సాగు ఎక్కువ విస్తీర్ణం బోరుబావులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మాత్రం చెరువులు, కుంటలు నిండితేనే పంటపొలాలకు నీళ్లు అందుతాయి. ఒకవేళ వర్షాలు ఆశించిన స్థాయిలో రాకపోతే మాత్రం జిల్లాలోని రైతులకు ఈ సీజన్‌లోనూ బోరుబావులే దిక్కవుతాయి. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. అదే యాసంగి సీజన్‌లో సుమారు ఆరు లక్షల ఎకరాల వరకే సాగు చేశారు. పంటల సాగుకు సింగూరు కాల్వల నుంచి సుమారు నలభైవేల ఎకరాలకు, నల్లవాగు నుంచి ఐదు వేల ఎకరాలకు నీళ్లందుతాయి. మిగతా వ్యవసాయం అంతా చెరువులు, కుంటల నీటితో పాటు బోరుబావులపైనే ఆధారపడి ఉంది. వర్షాకాలం మొదలైనందున జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిస్తే భూగర్భ జలం మరింతగాపైకి వచ్చే అవకాశాలున్నాయని అధికారవర్గాలు తెలిపాయి. వరుణుడు కరుణిస్తేనే జిల్లాలో వ్యవసాయం సవ్యంగా సాగే అవకాశం ఉన్నది. ఇప్పటికే నారు పోసిన, పత్తి విత్తనాలు నాటిన రైతులు వానల కోసం ఎదురుచూస్తున్నారు.



సర్కారు భూమికి ఎసరు

దర్జాగా ప్రహరీ నిర్మాణం

కబ్జా చేసిన భూమికి రిజిస్ట్రేషన్లు

సంగారెడ్డిలోని ఇంద్రకాలనీలో భూమాయ


374 సర్వేనంబర్‌లోని భూమిలో ఏర్పాటు చేసిన ఈ బోర్డును తొలిగించిన ఆక్రమణదారులు

సంగారెడ్డి టౌన్, జూన్19 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు గద్దల్లా వాలుతున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే సర్కారు భూమిని కబ్జా చేస్తున్నారు. ఇది ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డును సైతం రాత్రికి రాత్రి తొలగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

రూ.8 కోట్ల విలువ చేసే భూమి

ఇంద్రకాలనీలోని గాలి పోచమ్మ ఆలయం ఎదుట 374/6 సర్వే నంబర్‌లోని 20 ఎకరాల సర్కారు భూమి ఉండగా 1979లో కొంత భూమిని నిరుపేదల ఇళ్ల స్థలాలకు కేటాయించారు. ఇదే సర్వే నంబర్‌లో 18 గుంటల ఖాళీ స్థలం ఉండగా అందులో గాలి పోచమ్మ ఆలయానికి ఐదు గుంటలను ఇచ్చారు. రాజంపేట, మల్కాపూర్ రోడ్డుకు పక్కనే ఉన్న మిగిలిన 2వేల గజాల స్థలంపై రియల్టర్లు కన్నేశారు. ఈ ప్రాంతంలో మార్కెట్‌లో గజం ధర రూ.50వేలకుపైగా పలుకుతున్నది. అక్కడ రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి చుట్టూ తాత్కాలికంగా సిమెంట్ పలకలతో ప్రహరీని నిర్మించారు. దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే ఈ స్థలం కబ్జాకోరుల పాలైంది.

తప్పుడు రికార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్లు

ఇంద్రకాలనీలోని ఈ సర్కారు భూమికి రిజిస్ట్రేషన్ సైతం చేయడం గమనార్హం. కొంత మంది తప్పుడు రికార్డులను సృష్టించి ఇతరులకు విక్రయించినట్లు తెలిసింది. ఈ విషయంలో స్థానికులు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సర్కారు భూమికి రిజిస్ట్రేషన్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ వల్లూరి క్రాంతి తక్షణమే స్పందించి ఆ భూమిని సర్వే చేయాలని భూ కొలతల శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మూడు నెలల క్రితం ఈ భూమిని సర్వే చేసినప్పటికీ రిపోర్టు ఇవ్వడంలో జాప్యం నెలకొన్నది. అయితే, ఆ భూమిని కబ్జా చేసిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

కోర్టు పరిధిలో ఉన్నది

సంగారెడ్డిలోని ఇంద్రనగర్‌లో గాలిపోచమ్మ ఆలయం ముందు ఉన్న 374/6 సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించారు. ఇది తమ భూమి అంటూ కొంతమంది కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చారు. ఇప్పటికే అందులో సర్వే చేయించాం. రిపోర్టు రావాల్సి ఉన్నది. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ స్థలంపై నిర్ణయం తీసుకుంటాం. కోర్టులో కూడా కౌంటరు దాఖలు చేశాం.

- దేవదాసు, సంగారెడ్డి తహసీల్దార్


ప్రహరీ నిర్మించిన ఇంద్రకాలనీలోని స్థలం

సదాశివపేట బల్దియా పరిధిలో నిర్మాణాలు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఓ వైపు రెసిడెన్షియల్ అనుమతులు పొంది.. బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతుండగా.. ఏకంగా ప్రభుత్వ స్థలంలోనూ భారీ వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నా అధికారులు అటు వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు.

- సదాశివపేట, జూన్ 19

- అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు
- ప్రభుత్వ స్థలాల్లోనూ దర్జాగా భవనాలు
- జాతీయ రహదారి 65కు ఆనుకుని ఉల్లంఘన
- కన్నెత్తి చూడని అధికారులు


65వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ కందకం స్థలంలో కొనసాగుతున్న నిర్మాణం

నిబంధనలా..ఎక్కడా?


పట్టణంలో ఇటీవల లిఫ్ట్‌వైర్ తెగిపోయి ప్రమాదం జరిగిన భవనం

సదాశివపేట మున్సిపాలిటీలో 65వ జాతీయ రహదారిని ఆనుకుని రూ.వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వానికి చెందిన స్థలం(కందకం)లో దర్జాగా బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నారు. విలువైన ఈ స్థలంలో ఆక్రమణదారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం.. ఏళ్ల కిందటే తాత్కాలిక రేకుల షెడ్లు, చిన్నపాటి దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఏకంగా రూ.కోట్ల వ్యయంతో ఈ ప్రాంతంలో భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పనుల్లో అధికారులు నిమగ్నమై ఉన్న సమయంలో ఈ నిర్మాణాలకు తెరలేపారు. వాస్తవానికి ఈ కందకం స్థలంలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. అయినా, కొందరు తాత్కాలిక నిర్మాణాలను తొలగించి భారీ కమర్షియల్ భవనాలను నిర్మిస్తున్నారు. ఇదంతా అధికారుల కళ్లముందే జరుగుతున్నా.. పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంటి నంబర్లు కేటాయింపు

హైకోర్టు ఆదేశాలను పక్కన పెట్టి కందకం స్థలంలో మున్సిపల్ అధికారులు కొత్తగా ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇప్పుడు లోతైన సెల్లార్లు తవ్వి భారీ భవనాలు, వాణిజ్య సముదాయాలను నిర్మిస్తున్నారు. ఎన్నికల కోడ్ అంటూనే అధికారులు అక్రమార్కులకు సహకరించడంతో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని పట్టణంలో జోరుగా చర్చ జరుగుతోంది.

చర్యలు తీసుకుంటాం

నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు జరుగుతున్నట్టు మా దృష్టికి రాలేదు. కొన్ని చోట్ల అనుమతులకు విరుద్ధంగా జరిగి ఉండవచ్చు. అక్రమ నిర్మాణాలపై విచారణ జరుతాం. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం.

- భాస్కర్‌గౌడ్, టీపీవో

రెసిడెన్షియల్ అనుమతులతో..

ఇక బల్దియా పరిధిలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి 65 వెంట పలువురు రెసిడెన్షియల్ పేరిట తక్కువ ఫీజు చెల్లించి బహుళ అంతస్థుల భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలకు నిబంధనలు కూడా పాటించడంలేదు. సెట్‌బ్యాక్ లేకుండానే ఐదు కంటే ఎక్కువ అంతస్థులను నిర్మిస్తున్నారు. ఇలాంటి భవనాల్లో షాపింగ్‌మాల్స్ ఏర్పాటు చేస్తుండగా, కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా ఉండటం లేదు.

కనిపించని టాస్క్‌ఫోర్స్ కమిటీ

కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం పట్టణాల్లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో రోడ్లు భవనాలు, పోలీస్, రెవెన్యూ, ఫైర్, మున్సిపల్ అధికారులకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. అయితే, ఈ కమిటీ బల్దియా పరిధిలో నిద్రపోతున్నదని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు పాఠశాలలు
- రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

నర్సాపూర్/కొల్చారం, జూన్ 19 : మంచి పథకాలు ఏ ప్రభుత్వంలో వచ్చిన వాటిని అర్హులైన వారికి పారదర్శకంగా అమలు చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని 164 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే సునీతారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి మంత్రి కొండా సురేఖ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నీలం మధు పలువురు పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కేకును కట్ చేశారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మున్సిపల్‌చైర్మన్ అశోక్ గౌడ్ మున్సిపాలిటీకి గత ప్రభుత్వంలో మంజూరైన రూ.40 కోట్ల నిధులు నిలిచిపోయాయని, తిరిగి మంజూరు చేయాలంటూ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

తులం బంగారం ఇవ్వాలి : ఎమ్మెల్యే సునీతారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి డబ్బుతో పాటు ఇస్తామన్న తులం బంగారం కూడా లబ్ధిదారులకు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన డబ్బునే ఈ ప్రభుత్వం ఇవ్వడం తగదన్నారు.

బడిబాటపై కలెక్టర్ పాట

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ బడిబాటపై చిట్టి..పొట్టి అడుగులు..అనే పాటను రాసి, కూర్పు చేసి, ట్యూన్స్ అందించగా నర్సాపూర్‌లోని కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవిష్కరించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

రేవంత్‌రెడ్డి సారథ్యంలో విప్లవాత్మక మార్పులు

కొల్చారం, జూన్ 19 : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో వసతులు, సదుపాయాలతో పాటు బోధనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని మంత్రి కొండా సురేఖ అన్నారు. కొల్చారం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో బుధవారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన రోజే పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్‌లను విద్యార్థులకు అందించడం సీఎంకు విద్యాశాఖ పట్ల ఉన్న ఆసక్తికి నిదర్శనమన్నారు.

కాంగ్రెస్‌తోనే బీజేపీ అరాచకాలకు అడ్డుకట్ట

పటాన్‌చెరు, జూన్ 19 : బీజేపీ అరాచకాలకు అడ్డుకట్ట వేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని కోరుతున్నారని మొన్నటి పార్లమెంట్ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. పటాన్‌చెరు కాంగ్రెస్ నాయకుల నేతృత్వంలో బుధవారం వంద పడకల ఆసుపత్రిలో నిర్వహించిన రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోగులకు పండ్లను పంపిణీ చేసి కేక్‌ను కట్ చేశారు. రాహుల్ పుట్టిన రోజున పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన ప్రతీ శిశువు పేరున కాంగ్రెస్ నేత నీలం మధు రూ.10వేల చెక్కులను మంత్రి ద్వారా తల్లిదండ్రులకు పంపిణీ చేశారు.

తెలంగాణ ఆకాంక్షలను కాలరాసిన కేసీఆర్

- భవిష్యత్తులో బీఆర్ఎస్ భూస్థాపితం కావడం ఖాయం
- టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

సంగారెడ్డి రూరల్, జూన్ 19 : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాలరాశారని టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. సంగారెడ్డిలోని పాత జడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ తొలి ఉద్యమకారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం కోసం విద్యార్థులు, ఉద్యోగులు అన్ని వర్గాల వారు పోరాడారని, కానీ తెలంగాణ కేవలం తన వల్లే వచ్చిందని కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు.ఉద్యమకారులకు గుర్తింపుకార్డులు, రూ.25 వేల పెన్షన్, ఇళ్ల స్థలాలు, ఇతర సౌకర్యాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. అమరులైన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పి నమ్మకద్రోహం చేశారని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక కేవలం కేసీఆర్ కుటుంబం లాభపడిందన్నారు. ఉద్యమ ద్రోహులకు పక్కన చేర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అహంకారం వల్లే బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందని, భవిష్యత్తులో ఆ పార్టీ భూ స్థాపితం కావడం ఖాయమమన్నారు. అనంతరం ఆయన ఉద్యమకారులను సన్మానించారు. ఈ సమావేశంలో టీజేఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, వై.అశోక్‌కుమార్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ, ఉద్యమకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోదండరామ్

పదోన్నతుల పండుగ

- మెదక్ జిల్లాలో 548 మందికి ప్రమోషన్లు
- విధుల్లో చేరిన ఉపాధ్యాయులు
- తెల్లవారుజామున ఆన్‌లైన్‌లో ఆర్డర్ కాపీలు


మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్ జడ్పీహెచ్ఎస్‌లో విధుల్లో చేరుతున్న పీఈటీ

మెదక్ అర్బన్, జూన్ 19 : ఉపాధ్యాయులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. తొమ్మిదేళ్లుగా ఎస్జీటీలు, పదహారేళ్లుగా భాషాపండితులు, పీఈటీలు ప్రమోషన్ కోసం నిరీక్షిస్తున్నారు. కోర్టు కేసు కారణంగా భాషా పండితులు, పీఈటీలు పదోన్నతులకు నోచుకోకపోగా.. ఇటీవల హైకోర్టు నుంచి ఆదేశాలు రావడంతో రాష్ట్ర సర్కార్ వారి పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రమోషన్లు కల్పించింది.

ఉదయం నుంచి రాత్రి వరకు నిరీక్షణ

ఉపాధ్యాయులు రెండు రోజులుగా ఆర్డర్ కాపీల కోసం వేచిచూశారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిరీక్షించారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో విద్యాశాఖ ఆర్డర్ కాపీలను ఆన్‌లైన్‌లో పొందుపర్చింది. పదోన్నతి లభించిన వారు ఉదయం పాత పాఠశాలల్లో రిలీవ్ అయి కొత్త స్థానాల్లో విధుల్లో చేరారు.

మెదక్ జిల్లాలో 548 మందికి

మెదక్ జిల్లాలో మొత్తం 904 పోస్టులు ఖాళీలు ఉండగా.. ఇందులో 330 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. 548 మందికి పదోన్నతులు లభించాయి. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, బయోసైన్స్, ఫిజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రం, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ), స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ప్రమోషన్లు లభించాయి. 35 మంది ఉపాధ్యాయులకు రెండు, మూడు సబ్జెక్టుల్లో పదోన్నతి లభించింది. ఏదో ఒక సబ్జెక్టుల్లో చేరాల్సి ఉంటుంది. రిపోర్టు కానీ మిగితావి రాష్ట్ర విద్యాశాఖకు అధికారులు పంపిస్తారు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వస్తే సీనియార్టీ ప్రకారం భర్తీ చేస్తారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులుకు ఉత్వర్వులు అందించాం. సాంకేతిక సమస్య కారణంగా ఆర్డర్లు ఆలస్యం అయ్యాయి. జిల్లాలో 548 మందికి ప్రమోషన్లు లభించాయి. విధుల్లో ఎంత మంది చేరారో గురువారం తెలుస్తోంది.

- రాధాకిషన్, డీఈవో మెదక్

బడిబాట అడ్మిషన్‌లు 8,019

సంగారెడ్డి అర్బన్, జూన్ 19 : బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం బుధవారంతో ముగిసింది. సంగారెడ్డి జిల్లాలో చేపట్టిన బడిబాట ద్వారా 8,019 మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారు. 1257 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 3,501 మంది, రెండు నుంచి ఏడో తరగతి వరకు 3,876 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 642 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

అల్లర్ల ఘటనలో ప్రధాన నిందితులు అరెస్టు

మెదక్ అర్బన్, జూన్19 : ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనలో ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్టు చెసినట్టు మెదక్ ఎస్పీ బాలస్వామి తెలిపారు. బుధవారం నిందితులను మెదక్ కోర్టులో హాజరు పరచగా.. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్ చంద్ వారికి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్పీ పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగించినందుకు ఇప్పటివరకు అల్లర్ల కేసులో 36 మందిపై ఎనిమిది కేసులు నమోదు చేశామన్నారు. మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడం కోసం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే పట్టుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కోళ్ల వ్యర్థాలు యథేచ్ఛగా చెరువులోకి..

● కుక్కల స్వైరవిహారంతో గ్రామస్థుల ఆందోళన



కుకునూరుపల్లి, జూన్ 19: మండల కేంద్రంలోని చెరువులో కోళ్ల వ్యర్థాలను యథేచ్ఛగా పారబోయడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో చికెన్‌షాప్ యాజమానులు కోళ్ల వ్యర్థాలను గ్రామంలోని కల్కాలమ్మ చెరువుగట్టుపై, చెరువులో పారబోయడంతో నీరు కలుషితం అవుతున్నది. అంతేగాకుండా కుక్కల బెడద ఎక్కువైంది. కోళ్ల వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా చెరువు గట్టుపై చేరి అటువైపుగా వెళ్లే వాహనదారులు, పాదచారులపై దాడి చేయడంతో వారు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయంపూట చెరువు గట్టుపై వాకింగ్‌కి వెళ్లిన కొందరిని గాయపరిచిన ఘటనలు కూడా ఉన్నాయి. గత వారం జరిగిన గ్రామ సభలో పలువురు గ్రామస్థులు ఈ విషయమై ఫిర్యాదు కూడా చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శిని ఈ విషయమై వివరణ కోరగా చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను వేస్తున్న షాపు యజమానులకు త్వరలో నోటీసులు అందజేయనున్నట్టు తెలిపారు.

ఫుడ్ కల్తీ చేస్తే చర్యలు



సంగారెడ్డిలోని హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్

సంగారెడ్డి రూరల్, జూన్ 19: ఫుడ్ కల్తీ చేస్తే కఠిన చర్యలు తీప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ వ్యాపారులను హెచ్చరించారు. సంగారెడ్డిలో బుధవారం పలు హోటళ్లను ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. కలెక్టర్ క్రాంతి ఆదేశానుసారం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాసిరకం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ హోటళ్లలో తనిఖీలు చేయగా ఫుడ్ లైసెన్స్ ప్రదర్శించడం లేదని గుర్తించామన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే

● డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి



సంగారెడ్డిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

సంగారెడ్డి రూరల్, జూన్ 19: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.గాయత్రీదేవి అన్నారు. సంగారెడ్డిలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటి వరకు 147 స్కానింగ్ కేంద్రాలు అనుమతితో నడుస్తున్నాయని, ఐదు కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రెన్యూవల్ కోసం మరో ఆరు సెంటర్ల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినట్టయితే వారికి 3 నుంచి 5 ఏళ్లవరకు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ సభ్యులు డా.సంగారెడ్డి, డా.సుధారాణి, డా.శశాంక్, డా.మనోహర్‌రెడ్డి, డా.రాజుగౌడ్, వనజారెడ్డి, పల్లవి, చందర్, ప్రసాద్, వీర్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి

గజ్వేల్, జూన్ 19: ప్రజలకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు ఎన్నో హామీలను రేవంత్‌రెడ్డి ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక అన్నింటిని విస్మరించారన్నారు. గృహజ్యోతి పథకంతో 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం వాటి అమలు తీరుపై సమీక్ష నిర్వహించడంలో విఫలమైందన్నారు. గ్యాస్ డబ్బులు జమ, ఉచిత విద్యుత్ అందక వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని మండిపడ్డారు.



గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

'నులి'పేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలు
- 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు మందులు పంపిణీ





కొండపాక, జూన్ 19 : పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించేందుకు, పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఏటా జూన్ 20న జాతీయ నులి పురుగుల నివారణ దినం నిర్వహిస్తున్నారు. ఆ రోజున పిల్లలను నులి పురుగుల నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) అందజేస్తారు. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు పూర్తి చేశారు. గురువారం మాత్రలు వేసుకోని వారికి ఈ నెల 27న మాత్రలు అందజేయాలని నిర్ణయించారు.

వయసుల వారీగా..

పిల్లల వయస్సుల వారీగా ఆల్బెండజోల్ డోస్ అందిస్తారు. 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు 400ఎంజీలో సగం 200 ఎంజీ మాత్రను వేసుకోవాలి. మిగతా వారు 400 ఎంజీ మాత్రను వేసుకోవాలి. మాత్రను బాగా నమలాలి. అల్పాహారం లేదా భోజనం చేసినవారికే ఈ ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వాలని, ఖాళీ కడుపుతో ఉన్నవారికి ఎట్టి పరిస్థితిల్లో ఇవ్వరాదని వైద్యులు సూచించారు.

అపరిశుభ్రతతో నులిపురుగులు

అపరిశుభ్రతతోనే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. నులిపురుగులు రాకుండా ఉండాలంటే చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోర్లు పెరిగినప్పుడు వాటిని కత్తిరించుకోవాలి. అలా చేయకపోవడం వల్ల వాటిలో మట్టి చేరి అనారోగ్యానికి కారణమవుతారు. అలాగే, పరిశుభ్రమైన నీరు తాగాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడు శుభ్రంగా చేతులు కడుకోవాలి. కూరగాయాలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎల్లప్పుడు మూతలు కప్పి ఉంచాలి.

నులిపురుగుల వల్ల అనర్థాలు

నులిపురుగుల వల్ల పిల్లల్లో ఆనారోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారిలో నులిపురుగులు ఉంటే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. నులి పురుగులనేవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులు. వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత నియంత్రణ, పోషకాల గ్రాహ్యతను మెరుగుపర్చే ప్రయోజనాలు కలుగజేస్తుంది.

అవగాహన కార్యక్రమాలు

ఆల్బెండజోల్ మాత్రలను వేయడం కోసం అన్ని మండల కేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. అలాగే, గురువారం నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

సంగారెడ్డికి మెట్రో రైల్ తెస్తా..

- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు



రఘునందన్‌రావు, బీజేపీ నేత రాజేశ్వర్ దేశ్‌పాండేలను పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు

సంగారెడ్డి క్రైం, జూన్ 19: మెట్రో రైలును మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా సంగారెడ్డి వరకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు అన్నారు. బీజేపీ సంగారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక పీఎస్ఆర్ గార్డెన్స్‌లో బుధవారం రాత్రి అభినందన, సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ సంగారెడ్డి చౌరస్తా వరకు మెట్రో రైలు తప్పకుండా తెస్తానని హామీఇచ్చారు. ఈ విషయంలో త్వరలో మెట్రో సీఎండీని కలుస్తానన్నారు. గత ప్రభుత్వాలు సంగారెడ్డి వరకు మెట్రో రైలు తీసుకురావడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా సంగారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జగ్గారెడ్డి ఈ విషయంలో కనీసం ప్రయత్నం కూడా చేయలేదని ఆరోపించారు. సిద్దిపేటకు రైలు ఎలా వస్తుంది? సంగారెడ్డికి మెట్రో ఎందుకు తీసుకురాలేదని ఆయన బీఆర్ఎస్ నేతలను ధ్వజమెత్తారు. అయితే గతంలో సంగారెడ్డి బీజేపీకి అడ్డాగా ఉండేదని, గతంలో మూడుసార్లు సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ సీటు బీజేపీయే దక్కించుకుందని, గత స్ఫూర్తితోనే ఈ సారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యమకారులకు ద్రోహం చేసిన బీఆర్ఎస్

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఉద్యమకారులను బీఆర్ఎస్ ద్రోహం చేసిందని రఘునందన్‌రావు విమర్శించారు. ఈ కారణంగా గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైందని అన్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు ఎంపీని సన్మానించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, నాయకులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా హక్కులను సాధిస్తా

పటాన్‌చెరు, జూన్ 19: మెదక్ లోక్‌సభ స్థానం నుంచి చరిత్రాత్మక విజయం సాధించడంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి అపూర్వమని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పటాన్‌చెరు పాటి చౌరస్తాలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. అధికారంతో విర్రవీగిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మెదక్ ప్రజల ఓట్ల సునామీలో కొట్టుకుపోయారన్నారు. పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు ఐదురుగు ఎమ్మెల్యేలు ఉన్నా వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి బీజేపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. అనంతరం రైతులకు కిసాన్ సమ్మాన్ పథకం కింద రూ.20వేల కోట్లు విడుదల చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు పటాన్‌చెరులో ఎంపీ రఘునందన్‌రావుకు కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికి, భారీ ర్యాలీ నిర్వహించారు. అభినందన సభలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, ఆదెల్లి రవీందర్, రమేష్, గిద్దె రాజు, కే.రాజశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కడవేరుగు శివారులో కారు-ఆటో ఢీ

- 15 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం



చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులు



తీవ్ర గాయాలపాలైన మహిళలు

చేర్యాల, జూన్ 19 : చేర్యాల మండలం కడవేరుగు గ్రామశివారులోని పెట్రోల్‌పంప్ సమీపంలో బుధవారం రాత్రి కారు, ఆటో ఢీ కొన్న ఘటనలో మద్దూరు మండలం గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన సుమారు 15మంది గాయాలపాలయ్యారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎల్లమ్మ దేవాలయ ప్రతిష్ఠాపన వేడుకలు జరుగుతున్నాయి. గాగిళ్లాపూర్‌కు చెందిన ముక్క స్వరూప, ముక్క లక్ష్మి, ఏలూరి పోచవ్వ, ముక్క భారతమ్మ, ఏలూరి బాలమణి, ఏలూరి వజ్రమ్మ తదితరులు ఇంటిల్లిపాదిగా పోతిరెడ్డిపల్లిలోని తమ బంధువుల ఇంటికివెళ్లి వేడుకలకు హాజరయ్యారు. అందరు కలిసి రాత్రి ఆటోలో ఇంటికి తిరిగివస్తుండగా, మార్గంమధ్యలోని పెట్రోల్‌పంప్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తాపడటంతో అందరికీ గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు గమనించి 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. గాయాలపాలైనవారి సంఖ్య అధికంగా ఉండటంతో ప్రైవేటు అంబులెన్సుల ద్వారా చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు, సిబ్బంది క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. గాయపడిన వారిలో ముక్క స్వరూప, ముక్క లక్ష్మి, ముక్క భారతమ్మల పరిస్థితి విషమంగా ఉండటంతోపాటు ఏలూరి పోచవ్వ, ఏలూరి బాలమణి, ఏలూరి వజ్రమ్మలను మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటకు తరలించారు. మిగతా వారికి స్వల్పగాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారు. ఇంటిల్లిపాది కుటుంబసభ్యులు రోడ్డుప్రమాదానికి గురికావడంతో స్థానికులు, బంధువులు ఆస్పత్రికి తరలివచ్చారు.

ఫిలిప్పీన్స్ వెళ్లి ఆరేళ్లు..

- అప్పటి నుంచి అతని ఆచూకీ గల్లంతు..
- ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తల్లి ఆందోళన
- ఎస్పీకి ఫిర్యాదు.. గుర్తించిన సంగారెడ్డి పోలీసులు
- కొడుకుతో ఫోన్‌లో మాట్లాడిన తల్లి
- నెలరోజుల్లో అతను తిరిగివచ్చేలా చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూన్ 19: ఎంబీబీఎస్ చదివేందుకు అతను ఫిలిప్పీన్స్ వెళ్లాడు. తండ్రి మరణించిన సమయంలో ఓసారి ఇంటికి వచ్చి వెళ్లాడు. ఆ తర్వాత ఆరేళ్లుగా అతని ఆచూకీ లేదు. తల్లి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. సంగారెడ్డి పోలీసులు అతని ఆచూకీ కనుగొని ఆమెతో ఫోన్‌లో మాట్లాడించారు. దీంతో ఆ తల్లి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రానికి చెందిన సత్యాగామ మాణమ్మ కుమారుడు అరుణ్‌రెడ్డి (31).. 2012లో ఎంబీబీఎస్ చదివేందుకు ఫిలిప్పీన్స్ దేశం వెళ్లాడు. 2018లో తండ్రి వెంకట్‌రాంరెడ్డి మరణం అనంతరం ఇంటికి వచ్చి అదే ఏడాది తిరిగి ఫిలిప్పీన్స్ వెళ్లాడు. ఆరేళ్లయినా ఇంటికి రాకపోవడం, కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తల్లి మాణమ్మ ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ చెన్నూరి రూపేష్ అతని ఆచూకీ తెలుసుకోవాలని ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అరుణ్‌రెడ్డి పాస్‌పోర్టు, ఫోన్ నంబరు, ఫొటోలు తదితర వివరాలతో ఫిలిప్పీన్స్ ఎంబసీతో మాట్లాడారు. అరుణ్ ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేసి మాణమ్మతో మాట్లాడించారు. దీంతో ఆమె ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో అరుణ్‌రెడ్డి పాస్‌పోర్టు, ఇతర ధ్రువపత్రాలు పోగొట్టుకున్నాడని, భయంతో తల్లికి ఫోన్ చేయలేకపోయాడని ఎస్పీ రూపేష్ తెలిపారు. నెలరోజుల్లో అరుణ్‌రెడ్డి కందికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అరుణ్ ఎంబీబీఎస్ పూర్తి చేసినా పాస్‌పోర్టు పోగొట్టుకోవడంతో స్వదేశానికి రాలేక అక్కడే ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూపులు

- వర్గాలుగా రాహుల్ జన్మదిన వేడుకలు



గజ్వేల్‌లోని నల్లవాగు గడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్, జూన్ 19: గజ్వేల్ పట్టణ కాంగ్రెస్‌లో వర్గపోరు బహిర్గతమైంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా ఇక్కడి నాయకులు వర్గాలుగా విడిపోయి వేడుకలు జరుపుకున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, టీపీసీసీ నాయకులు గోపాల్‌రావు, యాదగిరి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, మోహన్నగారి రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని నల్లవాగు గడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు ఫాంహౌజ్‌లో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మునిసిపల్ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, నక్క రాములు గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఇందిరాపార్కు చౌరస్తాలో అన్నదానం నిర్వహించారు. ఇలా ఇరువర్గాలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించడంతో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

సిద్దిపేట అర్బన్, జూన్ 19: సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలోని దాబా పక్కన ఉన్న పాన్‌షాప్‌లో నిషేధిత గుట్కాలను బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగధాంపల్లి చౌరస్తాలో మహ్మద్ హమీద్ దాబా పక్కన పాన్‌షాప్‌లో గుట్కాలు, అంబర్ అమ్ముతున్నాడని నమ్మదగిన సమాచారంతో ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రూ.8 వేల విలువ చేసే గుట్కాలు, టొబాకో ప్యాకెట్లు సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..!

● ఆనెగుంట రోడ్డుపై ప్రమాదకరంగా మూలమలుపు



ఆనెగుంటకు వెళ్లే రోడ్డుపై మూలమలుపు వద్ద చెరువు

జహీరాబాద్, జూన్ 19: జహీరాబాద్ నియోజకవర్గంలోని అర్జున్‌నాయక్‌తండా-ఆనెగుంటతండా, షేకాపూర్-ఆనెగుంట, షేకాపూర్-మల్‌చెల్మ, షేకాపూర్-పర్శపల్లి, పస్తాపూర్-క్రిష్టాపూర్, రాయిపల్లిచౌరస్తా-బిడెకన్న, జహీరాబాద్-షేకాపూర్, హుగ్గెల్లి-కోహీర్, సజ్జాపూర్-పిచేర్యాగడి, కుప్పానగర్- ఝురాసంగం తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై గల మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ముఖ్యంగా షేకాపూర్- ఆనెగుంటకు వెళ్లే రోడ్డుపై చెరువుకట్ట వద్ద మూలమలుపు ఉండడంతో వాహనదారులు కొద్దిగా వేగంగా నడిపితే నేరుగా చెరువులోకి వెళ్లే పరిస్థితి ఉన్నది. జహీరాబాద్ నుంచి డౌన్‌టౌన్ మీదుగా అల్గోల్‌కు వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి ఉండగా, బ్రిడ్జికి ఇరువైపులా గోడలు లేకపోవడంతో బ్రిడ్జి వద్దకొచ్చేవరకూ గుంత కనిపించకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మూల మలుపుల వద్ద పొదలను తొలగించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

చిన్నశంకరంపేట, జూన్ 19: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ఆరునెలల నుంచి వేతనాలు రావడం లేదని ఎంపీడీవో దామోదర్‌కు కార్మికులు బుధవారం వినతి పత్రం అందజేశారు. సకాలంలో వేతనాలు అందక కుటుంబ పోషణ గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీ సురేష్‌షెట్కార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

నాగల్‌గిద్ద, జూన్ 19: పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. బుధవారం నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షుడు మోతీబాయి రాథోడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలాన్ని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సహకారంతో దశలవారీగా అభివృద్ధిలో ముందుంచుతామన్నారు. కాగా మండలంలో విద్యుత్ సరిగ్గా సరఫరా కావడం లేదని పలువురు సభ్యులు సభా దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఎంపీ విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని ఏఈ మోతిరాంకు సూచించారు. కాగా అంతకుముందు ఎంపీ దత్తాత్రి, శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రాజురాథోడ్, వైస్ ఎంపీపీ పండరియాదవ్, పార్టీ అధ్యక్షుడు మాణిక్‌రావుపాటిల్, ఎంపీటీసీ పండరినాథ్‌పాటిల్ పాల్గొన్నారు.

బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడుచుకోవాలి

నారాయణఖేడ్, జూన్ 19: బసవేశ్వరుడి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం బసవ మండపంలో సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్‌లకు సన్మాన సభను ఏర్పాటు చేశారు. బాల్కి పీఠాధిపతి బసవలింగ పట్టదేవర ఆధ్వర్యంలో వీరిని సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్‌షెట్కార్ మాట్లాడుతూ బసవేశ్వరుడు సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, మాణిక్‌రావుపటేల్, వీరశెట్టి, సతీష్ షెట్కార్, నాగిశెట్టి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌పటేల్ పాల్గొన్నారు. కాగా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ముత్యపు హన్మండ్లు పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా సురేష్‌షెట్కార్ ఎన్నికైతే చావిడి హనుమాన్ మందిరంలో 108 కొబ్బరి కాయలు కొడతానని మొక్కి బుధవారం సురేష్‌షెట్కార్ ద్వారా పూజలు చేయించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నారాయణఖేడ్ పట్టణంలోని పెద్ద దర్గాలో బుధవారం ఎంపీ సురేష్ షెట్కార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ యూనుస్, తాహేర్ అలీ, అహంఅలీ, షైనోద్దీన్, దిల్‌దార్‌ఖాన్, సయ్యద్‌సుమాన్ సురేష్ షెట్కార్‌ను సన్మానించారు.

ఖేడ్ అభివృద్ధికి కృషి చేస్తాం

ఖేడ్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిలు చెప్పారు. బుధవారం నారాయణఖేడ్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్ అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిలు హాజరయ్యారు. పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు చర్చించారు. వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనరు జగ్జీవన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గృహకార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



గృహ కార్మికుల సమస్యలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి రూరల్, జూన్ 19: గృహ కార్మికులు చట్టాలపై అవగాహణ పెంచుకోవాలని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సంగారెడ్డిలోని మెడ్వాన్ కార్యాలయంలో బుధవారం చట్టాలపై గృహ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో దంపతులు ఇద్దరు సాఫీగా ఉద్యోగాలు చేసుకునేందుకు గృహకార్మికులు ఎంతగానో తోడ్పడుతున్నారన్నారు. ఎంత కష్టపడినా గృహ కార్మికులకు గుర్తింపు దొరక్కపోవడం శోచనీయమన్నారు. గృహకార్మికుల సమస్యలపై మెడ్వాన్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని న్యాయాధికారి రమేష్ కొనియాడారు. అనంతరం మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. కాగా మెడ్వాన్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మెడ్వాన్ కో ఆర్డినేటర్ స్వప్న, ముజీబ్, గృహకార్మికులు పాల్గొన్నారు.

సమాచారం

నక్ష దారి ఆక్రమణను ఆపండి

కొండాపూర్: నక్షదారిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మమ్మదాపూర్ గ్రామస్థులు బుధవారం ఎంపీడీవో జ్యోతిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల నుంచి పొలాలకు వెళ్లే నక్షబాట(దారిని) రిధిరా జన్ వెంచర్ యాజమాన్యం డీటీసీపీ లేఅవుట్ పేరిట అక్రమ నిర్మాణాలు చేపడుతున్నదని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

సామూహిక అక్షరాభ్యాసం

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం ఆధ్వర్యంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

మట్టి రవాణాతో ప్రమాదాలు

జిన్నారం: ఇటుక బట్టీలకు నల్ల మట్టి రవాణా చేస్తుండగా.. ఆ మట్టి రహదారిపై పడి ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. రెండురోజులుగా జిన్నారం మండలం జంగంపేట, అన్నారం గ్రామాల మధ్య రాత్రివేళల్లో నల్ల మట్టిని ఇటుక బట్టీలకు తరలించగా.. రహదారిపై మట్టి పెళ్లలు పడ్డాయి. బుధవారం జంగంపేట గ్రామ శివారులో ఇటుక బట్టీ కార్మికులు రహదారిపై పడిపోయిన నల్లమట్టిని తొలగించారు. అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణా నిరోదించాలని స్థానికులు కోరారు.

ఫామ్ ల్యాండ్స్ భూ దందాను అరికట్టండి

సంగారెడ్డి రూరల్, జూన్ 19: నారాయణఖేడ్ నియోజవర్గంలోని నాగల్‌గిద్ద, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లోని వివిధ గ్రామాల్లో వెలసిన రియల్ ఎస్టేట్ దందాను అరికట్టాలని కుల వివక్ష పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంకు బుధవారం వినతి పత్రం అందజేశారు. వారిలో కేవీపీఎస్ నాయకులు దాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

తూప్రాన్: తూప్రాన్ మండలంలోని వెంకటాయపల్లి గ్రామానికి చెందిన తీగుళ్ల సుధాకర్‌కు వైద్య కోసం మంజూరైన రూ.1,20,000ల ఎల్‌వోసీ పత్రాన్ని బుధవారం తాజామాజీ ఉప సర్పంచ్ హరీశ్‌గౌడ్ అందజేశారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావొద్దు

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, జూన్ 19: పేదల వైద్య సహాయం కోసం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడం సమంజం కాదని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి హెచ్చరించారు. బుధవారం సిర్గాపూర్‌కు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు పీహెచ్‌సీ పరిస్థితి, సిబ్బంది పనితీరు గురించి మొరపెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించగా.. ఆంజనేయులు అనే రికార్డు అసిస్టెంట్ నెల పదిహేను రోజులుగా విధులకు గైర్హాజరవుతున్నా.. ఆయనకు హాజరు పట్టికలో గైర్హాజరు నమోదు చేయకపోవడం పట్ల ఎమ్మెల్యే వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిర్గాపూర్ పీహెచ్‌సీలో ఉన్న ఒక్క ల్యాబ్ టెక్నీషియన్ భాస్కర్‌ను డిప్యూటేషన్‌పై నారాయణఖేడ్ ఆసుపత్రికి పంపించగా.. అక్కడి వైద్యాధికారితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి భాస్కర్‌ను సిర్గాపూర్‌కు తిరిగి పంపాలని ఆదేశించారు. మీన అనే డాటా ఎంట్రీ ఆపరేటర్ సైతం విధులకు హాజరు కావడం లేదని తనిఖీలో తేలింది. ఉన్న ఇద్దరు వైద్యాధికారులు కూడా సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో తమకు వైద్యమందడం లేదని, 24 గంటలపాటు వైద్య సేవలు అందించాల్సిన సిర్గాపూర్ పీహెచ్‌సీ పరిస్థితి దారుణంగా మారిందని స్థానికులు ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లి.. సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ పీరప్ప, మాజీ సర్పంచ్ జంగం స్వప్న, నాయకులు మహేశ్వర్ గుప్తా, క్రిష్ణ, వెంకట్‌రావ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎంను కోరిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జూన్ 19: ఖేడ్ నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారంతో పాటు వివిధ అభివృద్ధి పనులకుగాను అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఫైనాన్స్, ప్లానింగ్, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కను స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి వెళ్లి ఆయనను కలిశారు.

దారి కేటాయించాలని విద్యార్థుల ధర్నా



నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గ్రామంలో కాలినడకన దారి కోసం ధర్నా చేస్తున్న జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నాగల్‌గిద్ద, జూన్ 19: మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామంలో బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ధర్నా చేపట్టారు. గ్రామం నుంచి పాఠశాలకు వెళ్లే దారి ఓ రైతుకు సంబంధించిన పట్టా భూమిలో ఉండడంతో.. పాఠశాలకు వెళ్లేందుకు ఆయన నిరాకరించాడు. దీంతో తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులతో పాటు స్థానికులు, పాఠశాల సిబ్బంది రహదారిపై ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సిద్ధిరాములు తన సిబ్బందితో కలిసి వచ్చి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిశ్రమకు కేటాయించిన భూముల పరిశీలన

జిన్నారం, జూన్ 19: జిన్నారం మండలం మంగంపేటలో డంపింగ్‌యార్డు, ఆలయం భూములను పరిశ్రమ కోసం కేటాయించిన స్థలంలో ఆక్రమించారనే ఫిర్యాదుల మేరకు అధికారులు మంగంపేటలో సందర్శించారు. ఈ సందర్భంగా మంగంపేట శివారు 55 సర్వే నెంబరులో ప్రైవేటు పరిశ్రమకు కేటాయించిన స్థలాన్ని సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి, తహసీల్దార్ భిక్షపతి, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధలు పరిశీలించారు. రెండేళ్ల క్రితం పరిశ్రమ ఏర్పాటు కోసం నాటి ప్రభుత్వం స్థలాన్ని టీఎస్ఐఐసీ ద్వారా మంజూరు చేసింది. ఇటీవల డంపింగ్‌యార్డును ధ్వంసం చేసి స్థలాన్ని ఆక్రమించారని, అదేవిధంగా పల్లె ప్రకృతివనం, నక్షబాట, ఆలయం స్థలాన్ని కూడా ఆక్రమించారని మంగంపేట గ్రామ వాసులు ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో స్థల పరిశీలన జరిపిన అధికారులు పరిశ్రమకు కేటాయించిన భూ విస్తీర్ణం, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, ఆలయ భూములపై విచారణ చేపట్టారు. కాగా పరిశ్రమ ఆదీనంలోని స్థలాన్ని అధికారులు గుర్తించి గ్రామ అవసరాలకు కేటాయించాలని నాయకులు నరేందర్, శ్రీకాంత్ తదితరులు అధికారులను కోరారు.

జేఎన్టీయూ కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు

పుల్‌కల్, జూన్ 19: చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ వద్ద గల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని పడకంటి పవిత్రచారి గోల్డ్ మెడల్‌ను సాధించారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన కేలో ఇండియా క్రీడల్లో ఉషా ఉమెన్స్ లీగ్‌లో పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం కళాశాలకు చేరిన విద్యార్థిని పడకంటి పవిత్రాచారిని కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు, మెకానికల్ విభాగాధిపతి ప్రసన్నలక్ష్మి అభినందించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయంపై సభ్యుల ఆగ్రహం



ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, జూన్ 19: సిర్గాపూర్ మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నదని సిర్గాపూర్ ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ వాసర్, వంగ్దల్, చీమల్‌పాడ్, కడ్పల్, సిర్గాపూర్, అంతర్గాం, బొక్కస్‌గామ్ తదితర గ్రామాల్లో చిన్నపాటి వర్షానికి గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, దీనిని సరిచేసే విద్యుత్ సిబ్బంది ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎక్కడో ఉంటూ ప్రైవేటు వారిచే పనులు చేయిస్తున్నారని సభలో ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి విద్యుత్ లైన్ల నిర్వహణ చేపట్టలేదని ఫలితంగా ట్రాన్స్‌కో నుంచి వచ్చిన మెటీరియల్ అంతా సిబ్బంది కాంట్రాక్టర్లకు అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. దీనికి అవసరమగు నిధులను మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి నిన్ననే కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ శాఖ ఏఈవోలు పంట నమోదులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు, వైస్ ఎంపీపీ ప్రయాగబాయి, ఎంపీడీవో మల్సూర్, తహసీల్దార్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. పదవి కాలం పూర్తి చేసుకుంటున్న ఎంపీటీసీలను ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే సిర్గాపూర్‌లోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే హరితహారం మొక్కలు నాటారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. సిర్గాపూర్ గ్రామపంచాయతీ వద్ద, ఎంపీపీ కార్యాలయం ఎదుట జరిగిన రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం లాంటిది

● మెదక్ ఎమ్మెల్యే రోహిత్ ● ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

పాపన్నపేట/జహీరాబాద్/కంగ్టి/నారాయణఖేడ్/చేగుంట జూన్ 19: రక్తదానం ప్రాణదానం లాంటిదని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ అన్నారు. బుధవారం రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాపన్నపేట మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించగా.. పలువురు రక్తదానం చేశారు. ఇటీవల అప్పుల బాధతో కొత్తపల్లిలో ఆత్మహత్య చేసుకున్న టప్పు మల్లేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే రోహిత్ పరామర్శించారు. వారి కుటుంబ దీనస్థితికి చలించిన ఎమ్మెల్యే బాధితుని కుమారుడు ప్రణయ్ బాధ్యత తానే తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం జహీరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా జిల్లా, నియోజకవర్గం అధ్యక్షుడు ఉదయ్‌శంకర్‌పాటిల్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన కంగ్టిలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక రాజీవ్ చౌక్ వద్ద కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, మాజీ చైర్మన్ మనోజ్‌పాటిల్, అధ్యక్షుడు చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఖేడ్‌లోని ఎంపీ సురేష్‌షెట్కార్ నివాసంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, శంకరయ్యస్వామి, కౌన్సిలర్ వివేకానంద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహేర్‌అలీ, మాణిక్‌రావు, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి తినిపించారు. చేగుంట మండలం వడియారంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డి రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కార్యకర్తలతో కలిసి నిర్వహించారు.



జహీరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

అర్ధరాత్రి 12 దాటితే దాబాలు, హోటళ్లు బంద్ చేయాలి

● జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి

జహీరాబాద్, జూన్ 19: అర్ధరాత్రి 12 దాటితే దాబాలు, హోటళ్లు కచ్చితంగా బంద్ చేయాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి జహీరాబాద్‌లోని పోలీస్‌స్టేషన్‌లో దాబాల, హోటళ్ల, బార్‌అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రేయింబవళ్లు తేడా లేకుండా హోటళ్లను తెరిచి ఉంచడం మూలంగా అందరికీ తలనొప్పిగా మారిందన్నారు. కొన్ని సందర్భాల్లో నేరాలు జరగడానికి ఆస్కారం ఏర్పడుతుందని చెప్పారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దాబాల, హోటళ్ల యజమానులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రాజబోయిన రవి, రూరల్ సీఐ మొయియోద్దీన్, ఎస్ఐలు లక్ష్మారెడ్డి, ప్రసాదరావు, నరేష్, క్రిష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించడం లేదని తహసీల్దార్ కార్యాలయానికి తాళం



కార్యాలయానికి తాళం వేస్తున్న ఇంటి యజమాని

నిజాంపేట, జూన్ 19: పద్దెనిమిది నెలలుగా అద్దె చెల్లించడం లేదని ఆ ఇంటి యాజమాని బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేశాడు. దీంతో కార్యాలయానికి వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. నిజాంపేటంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు సరైన భవనాలు లేకపోవడంతో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. 2022 డిసెంబర్ వరకు అద్దె చెల్లించగా, అప్పటి నుంచి అద్దె బకాయి పడిపోయింది. అద్దె చెల్లించాలని కార్యాలయం చుట్టూ తిరిగినా, ఆర్డీవోకు, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినా బకాయిలు చెల్లించలేదు. దీంతో ఇంటి యాజమాని బుధవారం ఉదయం కార్యాలయానికి తాళం వేశారు. దీంతో సిబ్బంది బయట నిలబడాల్సి వచ్చింది. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను సంప్రదించగా, ఇంటి యాజమానికి అద్దె బకాయి ఉన్న మాట వాస్తవమేనని, ఉన్నతాధికారులకు వివరించి అద్దె చెల్లించేలా చూస్తామని తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం, వ్యక్తి మృతి

కొల్చారం, జూన్ 19: డివైడర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పాపన్నపేట మండలం కొడపాక గ్రామానికి చెందిన బాబు(40) మండల పరిధిలోని పోతంశెట్‌పల్లికి ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తున్నాడు. కాగా.. పోతంశెట్‌పల్లి టీ జంక్షన్ నుంచి ఏడుపాయలకు వెళ్లే దారిలో దుర్గా వైన్స్ ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కొల్చారం ఎస్ఐ మహ్మద్‌గౌస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నారాయణఖేడ్, జూన్ 19: మండల పరిధిలోని గంగాపూర్ శివారులో బుధవారం ఉదయం గుర్తు తెలియని ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు సమాచారం అందడంతో తాము వెళ్లి పరిశీలించామన్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉందన్నారు. అతని చొక్కా జేబులో లభించిన ఫొటోల ఆధారంగా ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి అబ్బెంద గ్రామానికి చెందిన మడిగే మారుతి అని స్థానికులు గుర్తించారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఖేడ్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నారాయణఖేడ్, జూన్ 19: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి బుధవారం అవసరమైన చర్యలు చేపట్టారు. పట్టణ శివారులోని సంపులో తక్కువ సామర్థ్యం గల మోటారు ఉండటంతో అవసరాలకు అనుగుణంగా నీరు సరఫరా కాక నీటి సమస్య ఉత్పన్నమౌతుందని గుర్తించి 15 హెచ్‌పీ సామర్థ్యం గల మోటారును బుధవారం బిగించారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, నాయకులు రామక్రిష్ణ, సద్దాం సంపును సందర్శించి మోటారును ఆన్‌చేసి నీటి ప్రెషర్‌ను పరిశీలించారు.

కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలి: ఎంపీడీవో

కంది, జూన్ 19: కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. కంది మండల పరిధిలోని చేర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన దశాబ్ది వనం సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండల అభివృద్ధి అధికారులు మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనం చూసి పంచాయతీ కార్యదర్శి సుధీర్‌రెడ్డిని ఎంపీడీవో అభినందించారు. గతేడాది చేర్యాల శివారులో ఎకరా స్థలంలో దాదాపు రూ.8 లక్షల ఖర్చుతో 60 రకాలకు చెందిన 4 వేల మొక్కలను నాటారు. ఈ దశాబ్ది వనాన్ని కలెక్టర్ ఎ.శరత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ వేణు గోపాల్, ఏపీవో గురుపాదం, పంచాయితీ కార్యదర్శి సుధీర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై దృష్టిసారించాలి: ఎంపీపీ

చిన్నశంకరంపేట, జూన్ 19: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లోని స్వచ్ఛత కోసం స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు దృష్టిసారించాలని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులకు అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంచినీటి ట్యాంకర్లను శుద్ధిచేసి, ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలన్నారు. డ్రైనేజీలను శుభ్రం చేసి హైడ్రోజన్ క్లోరైడ్ పిచికారీ చేయాలన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్

చిన్నశంకరంపేట, జూన్ 19: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఇరిగేష్ బంగా ఎదురుగా మెదక్ చేగుంట రహదారి పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజి అయ్యి నీరు వృథాగా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముదిరాజ్‌లకు మత్స్యశాఖ చైర్మన్ పదవి ఇవ్వాలి

● తెలంగాణ ఫిషరీస్ సొసైటీ కన్వీనర్ స్వామి

వెల్దుర్తి, జూన్ 19: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు మత్స్యశాఖ చైర్మన్ పదవి ఇవ్వాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ కన్వీనర్, మెదక్ జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు స్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సామాజికవర్గానికి అన్యాయం చేసి దాదాపు 5 వేల మత్స్య సహకార సంఘాల్లో సుమారు 4,300 సంఘాలు ముదిరాజ్‌లకు, కేవలం 700 సంఘాలు మాత్రమే ఉన్న బెస్త వారికి రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్‌గా నియమించి ముదిరాజ్‌లను చిన్నచూపు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ముదిరాజ్‌లకు మత్స్యశాఖ ఇవ్వాలని కోరారు.

'ఫాంల్యాండ్స్ విక్రయాలపై విచారణ జరపాలి'

నారాయణఖేడ్, జూన్ 19: నారాయణఖేడ్ నియోజకవర్గంలో అక్రమంగా కొనసాగిస్తున్న ఫాంల్యాండ్స్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోర్గి సంజీవ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ వ్యాపారులు ఖేడ్ ప్రాంతంలో రైతుల వద్ద భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఫాంల్యాండ్స్ పేరిట ప్రచారం చేసి అమాయకులైన హైదరాబాద్, తదితర వాసులకు గుంటల రూపంలో విక్రయిస్తూ ఇటూ ప్రభుత్వ ఆదాయానికి, అటు ప్రజలకు నష్టం చేస్తున్నారన్నారు.

నిబంధనలకు లోబడి తైబజార్ వసూలు చేయాలి

చేగుంట, జూన్ 19: గ్రామపంచాయతీ నియమ, నిబంధనలకు లోబడి తైబజార్ వసూలు చేయాలని ఎంపీవో నరేష్‌కుమార్ పేర్కొన్నారు. నార్సింగి గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం తైబజార్ వేలం నిర్వహించారు. కాగా మైలారం రవీందర్ రూ.3.41 లక్షలకు బైజార్‌ను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు పాల్పడినా టెండర్ రద్దు చేస్తామన్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం, జూన్ 19: కాజీపల్లిలో అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బుధవారం కాజీపల్లి 181సర్వే నెంబరు ప్రభుత్వ భూమిలో చేపట్టిన పలు కట్టడాలను ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. కాగా నెలరోజుల వ్యవధిలో మూడుసార్లు రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చి వేయడం గమనార్హం.